సాక్షి

వికారాబాద్

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



రైతుబంధు మహాప్రభో!

యాసంగి సీజన్ పంట దిగుబడులు చేతికి వస్తున్నా ప్రభుత్వ పెట్టుబడి సాయం అందక రైతులు లబోదిబోమంటున్నారు. 8లో▸



పారిశుద్ధ్యం పట్టించుకోరా?

గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో చెత్త పేరుకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



మెరుగైన సేవలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు అవుతాయని మండల కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన రమేష్ మహరాజ్



గవర్నర్ తమిళిసైకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్ మహరాజ్

తాండూరు టౌన్: ఇటీవల రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగా నియమితులైన పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి మంగళవారం గవర్నర్ తమిళిసైను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట ఆర్థిక సంఘం సభ్యులు సుధీర్‌రెడ్డి, నెహ్రూ మాలోత్ తదితరులు ఉన్నారు.

మా భూములు తీసుకోవద్దు

మంత్రి సీతక్కను కోరిన అప్పాయిపల్లి దళిత రైతులు



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి తమ భూములు కావాలని అధికారులు అంటున్నారని, భూమే తమకు జీవనాధారమని అప్పాయిపల్లి దళిత రైతులు మంత్రి సీతక్కకు విన్నవించారు. మంగళవారం వారు నగరంలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నామని, అయితే తమ అసైన్డ్ భూములు కావాలని అధికారులు అంటున్నట్లు తెలిపారు. తమకు భూమి తప్ప మరో జీవనాధారం లేదని తెలిపారు. తమ భూముల జోలికి రాకుండా 47 కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ పోరాట సమితి అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎరన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు, రైతుబీమా నిధులు పక్కదారిపై విచారణ

కొందుర్గు: రైతుబంధు, రైతుబీమా నిధులను ఏఈఓ శ్రీశైలం పక్కదారి మళ్లించిన ఘటనపై మంగళవారం అధికారులు విచారణ ప్రారంభించారు. షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం, ఏఓ మధుసూదన్ మండల పరిధిలోని ఆగిర్యాల, తంగెళ్లపల్లి, వెంకిర్యాల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. బాధితులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. అయితే ఏఈఓ తమ వద్ద ఎలాంటి డబ్బులు తీసుకోలేదు కానీ తమ గ్రామానికి చెందిన కొంతమంది మరణించినప్పటికీ రైతుబీమా డబ్బులు రాలేదని వెంకిర్యాల, తంగెళ్లపల్లి గ్రామస్తులు తెలిపారు. ఆగిర్యాలలో బేగరి కిష్టమ్మ ధ్రువపత్రాలు ఓ ముస్లిం రైతు పేరున ఎడిట్‌చేసి రైతుబీమా డబ్బులు ఖాజేసిన విషయమై అధికారులు విచారణ చేశారు.

చేవెళ్ల చేజారొద్దు

సెంటిమెంట్ స్థానంలో ఎంపీ సీటు గెలిచితీరాల్సిందే

- రాష్ట్రంలో 14 స్థానాలకు తగ్గకుండా చూడాలి
- సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్నికల శంఖారావం పూరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న సీఎం రేవంత్ చిత్రంలో సునీతారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా/మొయినాబాద్: కాంగ్రెస్ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. చేవెళ్ల సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ మంగళవారం ఇక్కడి నుంచే లోక్‌సభ ఎన్నికల సమరానికి సన్నద్ధతను ప్రకటించింది. తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలుండగా వీటిలో 14 స్థానాలకు తగ్గకుండా గెలిచితీరాలని నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చేవెళ్లను చేజారనివ్వొద్దని కార్యకర్తలకు సూచించింది. ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా మంగళవారం రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా జన జాతర పేరుతో చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించింది.

భారీ మెజార్టీతో గెలిపించాలి

సీఎం సహా ఇతర ముఖ్యనేతలంతా మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి ర్యాంప్‌పైకి చేరి కార్యకర్తలకు అభివాదం చేశారు. చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయబోయేది సునీతనే అని పరోక్ష సంకేతాలు ఇవ్వడం గమనార్హం. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో ఎంతో మేలు



ఎల్‌ఆర్‌ఎస్‌తో జిల్లాకు ఎంతో మేలు జరుగనుంది. సంపన్న జిల్లాగా ము ద్రపడ్డ రంగారెడ్డిని కేసీఆర్ ప్రభుత్వం అనాథగా మార్చింది. తెలంగాణ లోని అన్ని జిల్లాలు దీనిపైనే ఆధారపడేవి. అన్ని జిల్లాలకు రైలు బోగీ లాంటిది. నేవీ ప్రాజెక్టు, రైల్వే లైను, రోడ్డు విస్తరణ చేపట్టకుండా అడ్డుకుంది.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

అవమానాలు భరించలేకే..



బీఆర్‌ఎస్ పాలనలో అనేక ఇబ్బందులు పడ్డాం. అవమానాలు ఎదుర్కొన్నాం. కేసులపాలయ్యాం. కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉంది. పేదల ఆశాజ్యోతిగా రేవంత్‌ను నమ్ముతున్నా. మనం చేవెళ్లను గెలిపించుకుని సీఎంకు గిఫ్ట్‌గా ఇవ్వాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలి.

– సునీతారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

‘పది’ పరీక్షలకు సిద్ధం కండి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 18నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఎక్కడ కూడా చిన్న సమస్య రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇతరులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని ఆదేశించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, ఏసీజీఈ రామ్‌రెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ లక్ష్యాలను పూర్తి చేయండి

జిల్లాలో ఉపాధి హామీ పథకం లక్ష్యాలను వారం రోజుల లోపు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులకు కూలీలు వచ్చేలా చూడటంతోపాటు గ్రామానికి, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. అలాగే పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయా మండలాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్ష కేంద్రాలను విజిట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 24గంటల్లో హోర్డింగ్స్, ఫ్లెక్సీను తొలగించాలని ఆదేశించారు.



ధారూరు స్మృతివనంలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

పర్యాటకులను ఆకర్షించేలా పనులు

- డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్
- కోట్‌పల్లి ప్రాజెక్టు సందర్శన

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకులను ఆకర్షించేలా పనులు చేపడతామని డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం ప్రాజెక్టు తోపాటు ధారూరులోని స్మృతి వనం, ఫారెస్టు రేంజ్ కార్యాలయ భవన నిర్మాణ పనులు, నర్సరీని పరిశీలించారు. కొత్తగా నిర్మించిన అర్బన్ పార్కు గేటును పరిశీలించారు. ప్రాజెక్టు సమీపంలోని అడవిలో వాచ్ టవర్ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ వాచ్ టవర్ పర్యాటకులను ఆకర్షించేలా నిర్మిస్తామన్నారు. టవర్ ఎక్కే ప్రతి ఒక్కరికీ అడవి అందాలు, ప్రాజెక్టు, పచ్చటి పొలాలు కనిపించేలా చూస్తామని తెలిపారు. అలాగే పర్యాటకులు సేద తీరడానికి, వన భోజనాలు చేసేందుకు చక్కటి గుడిసెలు నిర్మించాలని నిర్ణయించారు. ప్రాజెక్టు సమీప అటవీ ప్రాంతంలో పర్యటించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు వద్ద అర్బన్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.50కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులను ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ కృష్ణ, బీట్ ఆఫీసర్ నరేశ్‌కు సూచించారు. అనంతరం ధారూరులోని స్మృతి వనాన్ని, ఫారెస్టు రేంజ్ కార్యాలయ భవన నిర్మాణాన్ని, నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తాండూరు ఎఫ్ఆర్ఓ శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 16,823 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైతే అనుమతి లేదు

వికారాబాద్ అర్బన్: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య, ఆర్టీసీ, పోలీస్, మున్సిపల్, తపాల శాఖల అధికారులతో ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లా 29 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 14 ప్రైవేటు, 9 ప్రభుత్వ, 6 రెసిడెన్సియల్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 35 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డీఓలు విధులు నిర్వహించనున్నారు. వీరే కాకుండా ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేయనున్నాయి.

హాజరు కానున్న 16,823 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 16,823 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఫస్ట్ ఇయర్‌లో జనరల్ విద్యార్థులు 6,447 మంది ఉండగా, ఒకేషనల్ విద్యార్థులు 1,352 మంది హాజరు కానున్నారు. సెకెండ్ ఇయర్‌లో జనరల్ విద్యార్థులు 7,689 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,335మంది పరీక్షలు రాయనున్నారు. వికారాబాద్‌లో 8, తాండూరులో 8, పరిగిలో 5, కులకచ్చర్లలో 2, కొడంగల్, పెద్దేముల్, మర్పల్లి, నవాబుపేట, మోమిన్‌పేట, దోమ మండల కేంద్రాల్లో ఒక్కో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్‌లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించారు.



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

సీసీ కెమెరాల నిఘాలో..

పరీక్ష పేపర్ల సీల్ తీయడం, సీల్ వేయడం వంటివి పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో జరగనున్నాయి. సీసీ కెమెరాలు ఉన్న ప్రైవేటు కళాశాలలనే ఎంపిక చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందంలో సీనియర్ ప్రిన్సిపాల్, ఏఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్ ఉంటారు.

సెంటర్ లొకేషన్ యాప్

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కేంద్రాల అడ్రస్ సులభంగా తెలుసుకునేందుకు సెంటర్ లొకేషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానం ప్రస్తుతం ఎంసెట్ పరీక్షల్లో అమలు చేస్తున్నారు. ఈ యాప్ రెండు ఏళ్లక్రితం అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోగలుగుతున్నారు. అంతేకాకుండా డీఐఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సెల్ నంబర్ 9963356062లో సంప్రదించవచ్చు. హాల్ టికెట్లను నేరుగా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

నిమిషం ఆలస్యమైతే అంతే..


పరీక్ష కేంద్రాలకు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతించరు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష మొదలవుతుంది. 8:30 నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఇంటర్ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. పరీక్ష కేంద్రాల్లోకి 30 నిమిషాల ముందే అనుమతి ఇస్తారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. జవాబు తెలిసిన ప్రశ్నలను ముందుగా రాయాలి. విద్యార్థులు పరీక్షలు తప్పితే తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదు. వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయి. అందులో ఉత్తీర్ణులు కావచ్చు.

– శంకర్, ఇంటర్మీడియెట్ నోడల్ ఆఫీసర్

ఇది తాత్కాలిక విరామమే..



మాట్లాడుతున్న కేటీఆర్



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- మళ్లీ మంచిరోజులు వస్తాయి
- ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి
- బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్

తుర్కయంజాల్: ‘కారు 24 ఏళ్ల పాటు 100 స్పీడ్‌తో ప్రయాణించి, ప్రస్తుతం సర్వీసింగ్ మాత్రమే వెళ్లింది. ఇది తాత్కాలిక విరామం మాత్రమే, కొన్ని నెలల్లోనే మంచి రోజులు వస్తాయి.. ఓటమితో కుంగిపోవద్దు.. మనలో పోరాట పటిమ అలాగే ఉంది’ అని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వాళ్లు ఇచ్చిన మహాలక్ష్మి, చేయూత పథకాలకే రూ.48 వేల కోట్లు అవసరమని తెలిపారు. రైతుబంధు పథకానికి అదనంగా రూ.8 వేల కోట్లు కావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయన స్థాయికి తగ్గట్లుగా మాట్లాడం లేదని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కృష్ణానది జలాల మీద హక్కులను కేంద్రానికి కట్టబెట్టాడని మండిపడ్డారు. రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా తొంభై శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, కేవలం కాల్వలు తవ్వితే రైతులకు సాగు, తాగు నీరు అందిచవచ్చన్నారు. ఈ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పదేళ్లు అధికారం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకలితో ఉన్నారని, ఆ పార్టీలో జిల్లాకో ముఖ్యమంత్రి ఉన్నాడని ఎద్దేవా చేశారు. వీళ్లకు ఎక్కువ సమయం అవసరం లేదని 6 నుంచి 9 నెలలు పోతే వాళ్లకు వాళ్లే కొట్టుకుంటారని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అయినప్పటికీ ప్రజలకు వివరించడంలో వెనుకబడ్డామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ బూటకపు హామీలపై ప్రజల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ఒక విజన్ ఉన్న నాయకుడని, ఆయన హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, సత్తు వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు.

వైద్య నిబంధనలు తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

కొత్తూరు: అనారోగ్యంతో తమ వద్దకు వచ్చే వారికి ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని పలు ఆస్పత్రులు, క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ.. తమ వద్దకు వైద్యం కోసం వచ్చే వారికి ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సలు నిర్వహించి తదుపరి వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. నేమ్ బోర్డుల్లోనూ ప్రథమ చికిత్స కేంద్రం అనే ఉండాలని సూచించారు. కాగా పట్టణంలో పలువురు ఆర్ఎంపీలు ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. కొన్ని క్లినిక్‌లలో అనుమతులు లేకుండానే మెడికల్ షాపులు నిర్వహించడంతో పాటు నిపుణులైన సిబ్బంది లేకుండానే మందులు విక్రయిస్తున్నారన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. తనిఖీల్లో వైద్యుడు హరికిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు వృత్తి పవిత్రమైనది



పోలీసు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

- ఎస్పీ కోటిరెడ్డి
- కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణ కార్యక్రమం ప్రారంభం

అనంతగిరి: పోలీసు వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వికారాబాద్ పీటీసీలో మంగళవారం నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడారు. ఆసిఫాబాద్ నుంచి 55మంది, రామగుండం నుంచి 109 మంది, సిద్దిపేట నుంచి 60 మంది అభ్యర్థులు శిక్షణకు వచ్చినట్లు తెలిపారు. 9 నెలల శిక్షణా కాలంలో కొత్త విషయాలు తెలుసుకోవాలని సూచించారు. దేశంలో తెలంగాణ పోలీసులకు సముచిత స్థానం ఉందన్నారు. ఆ ఖ్యాతిని నిలపాలని సూచించారు. స్వీయ క్రమశిక్షణ పాటించాలని, శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ప్రిన్సిపాల్, ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు అంజయ్య, బాలకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలప ట్రాక్టర్ పట్టివేత


ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

దోమ: అక్రమంగా కలప తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఐ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి సమీపంలో కొందరు వ్యాపారులు మంగళవారం అక్రమంగా కలపను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కలపను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా గుర్తించారు. వాటికి సంబంధించిన ధ్రువ పత్రాలను అడిగారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

పొలంలో ట్రాక్టర్ చోరీ

తాండూరు రూరల్: పొలం వద్ద ఉన్న ఓ ట్రాక్టర్ చోరికి గురైంది. ఈ సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లాపూర్ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరుకు చెందిన నర్సిరెడ్డికి అల్లాపూర్ శివారులో వ్యవసాయ పొలం ఉంది. దీనిలో పనుల కోసం ఆయన ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను అపహరించారు. ఈ మేరకు నర్సిరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూమి ఇప్పించాలని వినతి


ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న రాములమ్మ

దోమ: భూ కొనుగోలు విషయంలో రియల్టర్లు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చీమె రాములమ్మ వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ సుదర్శన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో తమ వ్యవసాయ భూమిలో రియల్టర్లు కబ్జా పాల్పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేయించి తన భూమిని కబ్జాదారుల నుంచి ఇప్పించాలని కోరారు.

తల్లిదండ్రులను కోల్పోయిన యువకుడికి చేయూత


సిద్ధుకు ఆర్థికసాయం అందిస్తున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు

బొంరాస్‌పేట: విద్యుతాధికారుల నిర్లక్ష్యానికి ఓ యువకుడు అనాథగా మారాడు. మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో చోటు చేసుకున్న విద్యుదాఘాతంలో బోయిని లక్ష్మణ్, లక్ష్మి దంపతులు విగత జీవులైన సంగతి తెలిసిందే. వీరి కుమారుడు సిద్ధు అనాథ అవ్వడంతో పలువురు స్పందించారు. తల్లిదండ్రులను కోల్పోయిన అతడి పరిస్థితిపై లక్ష్మణ్ పదో తరగతి మిత్రులు తోడ్పాటునందించారు. మండల కేంద్రానికి చెందిన 1993–94 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏకమై రూ.55 వేలు పోగు చేసి సిద్ధుకు మంగళవారం అందజేశారు.

రైతుబంధు మహాప్రభో!

వ్యవసాయానికి తోడ్పాటు అందించడానికి శ్రీకారం చుట్టిన 'రైతుబంధు' అమలులో అలసత్వం కనిపిస్తోంది. సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా రైతులందరికీ పెట్టుబడిసాయం అందక లక్ష్యం నీరుగారుతోంది. సకాలంలో నగదును జమ చేయాలని రైతుబంధు అందని రైతులు మొరపెట్టుకుంటున్నారు.


సాగులో ఉన్న వరి పంట

- మూడు నెలలు గడిచినా అందని సాయం
- ఖాతాల్లో జమ అయింది రూ.140.58 కోట్లే
- విడుదల చేయాలంటున్న లబ్ధిదారులు

తాండూరు: యాసంగి సీజన్‌లో పంట దిగుబడులు చేతికి వస్తున్నా ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం అందక రైతులు లబోదిబోమంటున్నారు. గతేడాది డిసెంబర్ మూడో వారం నుంచి రైతుబంధు డబ్బులు జమ కావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిపివేశారు. అనంతరం మూడెకరాలలోపు అన్నదాతలకు రైతుబంధు నగదును జమ చేశారు. మిగతా వారికి నేటికి సాయం అందలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు కావొస్తున్న దశలో పెట్టుబడి సాయం అందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభమైన మొదటి నెలలోనే పెట్టుబడి సాయాన్ని ఖాతాలో జమ చేసేవారు. దీంతో పంట ఖర్చులకు వాటిని ఉపయోగించుకునేవారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం అలాంటి వాతావరణం ఉండాలని కర్షకులు కోరుతున్నారు. సీజన్ ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా రైతుబంధు అందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆరు లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలోని 20 మండలాల్లో 525 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అధికంగా పత్తి, కంది, వరి పంటలతో పాటు మరో 15 రకాల పంటలు సాగవుతున్నాయి. 6,23,392 ఎకరాలలో సాగు చేస్తున్న 2.95 లక్షల మంది రైతులకు ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. 2018లో ఖరీఫ్ సీజన్ నుంచి గత ప్రభుత్వం రైతుబంధును అమలు చేసింది. పథకం ప్రారంభించిన సమయంలో రైతులకు ఎకరాకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. 2019 నుంచి ఎకరాకు రూ.5 వేల చొప్పున ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి 10 విడతలుగా రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం అందింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీమ్‌లలో రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చింది.

పెట్టుబడి సాయం రూ.322.76కోట్లు

జిల్లాలో రైతులకు రైతుబంధు పథకం ద్వారా రబీ సీజన్‌లో రూ.322.76కోట్ల వరకు పెట్టుబడి సాయం అందించాలి. కానీ సగానికి తక్కువే అందించి మమ అనిపించారు. గతేడాది డిసెంబర్ మూడో వారం నుంచి రైతుబంధు పథకం సాయాన్ని ప్రారంభించారు. మొదట ఎకరం నుంచి మూడెకరాల లోపు రైతులకు నగదును ఖాతాలో వేశారు. ఈ నెలాఖరు వరకు 2,04,007 మంది రైతులకు రూ.140.58 కోట్ల నగదును ఖాతాలలో జమ చేశారు. సీజన్ ముగిసిన ఇంకా జమ చేయకపోవడంతో నగదు అందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ అందుతుంది



రైతుబంధు పథకం ద్వారా జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క రైతుకు పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలలో జమ చేస్తాం. విడతల వారీగా రైతులకు పెట్టుబడి నగదు అందుతుంది. ఇప్పటి వరకు మూడెకరాలలోపు రైతులకు జమ చేశాం. మిగతా వారికి నెల రోజుల్లో అందజేస్తాం.

– గోపాల్, వ్యవసాయాధికారి, వికారాబాద్ జిల్లా

అర్హులకు సంక్షేమ పథకాలు


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, నాయకులు

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేందుకు చర్యలు తీసుకుంటామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల బహిరంగ సభకు కార్యకర్తలతో కలిసి ఆయన బయలుదేరారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా సభకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎంతో శ్రమిస్తోందన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు ప్రజలకు అందుతున్నాయన్నారు. మరో రెండింటిని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రజలందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే ఉత్తమం

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

అనంతగిరి: జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 9న నిర్వహిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమన్నారు. లోక్ అదాలత్‌తో రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనన్నారు. కోర్టులలో పెండింగ్ ఉన్న సివిల్ కేసులలో కూడా రాజీమార్గంలో పరిష్కరించేలా చూడాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి

పత్తి పైసలు చెల్లించండి

వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతుల నిరసన


వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

పరిగి: పత్తిని విక్రయించి నెలలు గడుస్తున్న నేటికీ డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం పరిగిలో వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆయా గ్రామాల పత్తి రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పత్తి రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆరుగాలం శ్రమించి పత్తిని పండించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే అధికారులు డబ్బులు వేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అప్పులు తెచ్చి పండించామని, పంటలు విక్రయించిన డబ్బులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోయారు. డబ్బులు రాక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు తమ నగదును ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

పంచాయతీ డ్రైవర్లకు లైసెన్స్‌లు ఇవ్వాలి

కొందుర్గు: పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ట్రాక్టర్లు నడిపే పంచాయతీ కార్మికులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ చౌదరిగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారినా పంచాయతీ కార్మికుల సమస్యలు తీరడం లేదని వాపోయారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం అమలు చేసి కార్మికులు, కారోబార్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లను ఒకే గాడిలో కట్టేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి వారి నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టి వేతనాలు అందించాలని కోరారు. అదే విధంగా కార్మికులకు సంబంధిత పనిలో పూర్తిస్థాయి అవగాహన కోసం ఉచిత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లు అందజేయాలన్నారు. ప్రతీ కార్మికుడికి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, పంచాయతీ కార్మికులతోపాటు ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు జంగయ్య, వీరేశ్, గోపాల్, రమేశ్ నాయక్, పాపయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన


ధీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణ కేంద్రంలోని కార్గిల్ కాలనీలో మంగళవారం ధీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా జరిగాయి. నూతన ఆలయ నిర్మాణం పూజా కార్యక్రమాలను కిట్టు స్వామి బృందం ద్వారా ధ్వజస్తంభం, కలశ ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు బంధు మిత్రుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో సమీక్ష

కొడంగల్ రూరల్: కొడంగల్ మార్కెట్ యార్డులో వ్యాపారాలను ప్రారంభించేందుకు మార్కెట్ కమిటీ అధికారులు మంగళవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఓ సారంగపాణి మాట్లాడుతూ.. వ్యాపారులకు కావాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఇందులో దుకాణ సముదాయాలు, షెడ్లు, తాగునీటి వసతి, సీసీరోడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో కార్యదర్శి చంద్రశేఖర్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

శంషాబాద్: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందింది. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రాంనగర్ గుండు ప్రాంతంలో నివాసముంటున్న రాజ్యమ్మ (50) తన చిన్న కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై సొంతూరు మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండకు వెళ్లింది. సోమవారం సాయంత్రం తిరిగి వస్తుండగా పట్టణంలోని నెక్సా షోరూం సమీపంలో రాజ్యమ్మ కళ్లు తిరిగి కిందపడడంతో తలకు బలమైన గాయలయ్యాయి. వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు


బొంరాస్‌పేట: రోడ్లను పరిశీలిస్తున్న కలెక్టరు నారాయణరెడ్డి

కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రంగంపల్లి గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్ల పనులను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేశ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. నాణ్యతతో కూడిన పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ప్రత్యేక పాలన కొనసాగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ఎప్పటికప్పుడు చూసుకుంటూ ప్రజల అవసరాలను తీర్చాలన్నారు. ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రత లోపిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ సుదర్శ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

బొంరాస్‌పేట: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లను మంగళవారం కలెక్టరు నారాయణరెడ్డి పరిశీలించారు. మండల పరిధిలోని మెట్లకుంటలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని ఆయన సూచించారు. అలాగే మురుగు కాల్వల నిర్మాణం, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌కుమార్, మాజీసర్పంచ్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి సిద్ధు తదితరులున్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

కలెక్టర్‌కు ఏబీవీపీ నాయకుల వినతి

అనంతగిరి: కోనో కార్పస్ వృక్షాలను ప్రభుత్వం గుర్తించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ జిల్లా కన్వీనర్ మంజునాథరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ ప్రాంతాలు, ఉద్యానవనాలు, పలు చోట్ల, రోడ్ల మధ్యలో ఈ వృక్షాలను నాటించారన్నారు. వీటితో మనుషులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పలువురు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారన్నారు. హరితహారంలో భాగంగా ఈ చెట్లను ఎక్కువగా పెంచారన్నారు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా కోనో కార్పస్ వృక్షాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు, జగదీష్ చారి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

పారిశుద్ధ్యం పట్టించుకోరా?


పూడుకుపోయిన నాలా

దోమ: గ్రామాలలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో పాటు నాలాలను శుభ్రం చేయలేని దుస్థితి ఉంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని రాకొండ గ్రామంలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా తయారయ్యాయి. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో పాటు ముళ్ల కంచెలు, నాలాలు అపరిశుభ్రంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అటు ప్రత్యేక అధికారులు సైతం గ్రామానికి రావడం లేదని మండిపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పరిశుభ్రతకు పాటు పడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గమ్యం గతి తప్పుతోంది!

సరైన సమయానికి.. అనుకున్న ప్రదేశానికి వెళ్లాలనే తొందరలో ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఆత్రుత వారి గమ్యాన్నే మార్చేస్తోంది.

- అతివేగంతో వెంటాడుతున్న మృత్యువు
- ప్రాణాంతకంగా మారుతున్న ప్రైవేట్ వాహనాల ప్రయాణం
- ఇప్పటికే ప్రాణాలు కోల్పోయిన పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ (ఫైల్)

మంచాల: అతివేగం ప్రయాణికుల ప్రాణాలను బలితీసుకుంటుంది. ఇలాంటి దుర్ఘటనలతో పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటూ.. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. నగరంలోని ఉప్పల్, ఎల్బీనగర్, బీఎన్‌రెడ్డి, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఇబ్రహీంపట్నం, యాచారం, మాల్, మాడ్గుల, చారకొండ, నల్లొండ జిల్లా చౌటుప్పల్, వలిగొండ, చింతపల్లి, నాంపల్లి, మల్లేపల్లి మండలాలకు.., సంతోష్ నగర్ నుంచి కందుకూరు, తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ మండలాలకు వెళ్లే ఉద్యోగస్తులు ముందుగా వాహనాన్ని మాట్లాడుకుని నెలకు కొంత మొత్తం డబ్బు చెల్లిస్తున్నారు. ఉదయాన్నే సాగర్ రింగ్ రోడ్డు నుంచి మొదలుకుని ఉద్యోగస్తులను ఎక్కించుకుని మల్లేపల్లి వరకు చేరవేస్తారు. సాయంత్రం తిరుగు ప్రయాణం ఉంటుంది. వీరి పని ప్రదేశాలకు, గమ్యస్థానాలకు సమయానికి చేర్చాలనే తొందరలో వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఎన్నో ప్రమాదాలు సంభవించినా.. మార్పు రాకపోవడం శోచనీయం.


ఆగాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

సంతాపం వ్యక్తం చేసిన డీఈఓ

ఆగాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని డీఈఓ సుశీందర్‌రావు సందర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తంచేశారు.


ప్రేమ్‌కుమార్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు తదితరులు

ఆగాపల్లి ప్రమాదం అదే తరహా

మంచాల మండల పరిధిలోని ఆగాపల్లి వద్ద సోమవారం సాయంత్రం 'స్విఫ్ట్‌ను ఢీకొట్టిన తుఫాన్' ఇదే తరహా ప్రమాదం. తుఫాన్‌లో మాడ్గుల మండల పరిధిలోని కులుకులపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్(43), బాలనారాయణ, కృష్ణారెడ్డి, వెంకటయ్య, నాగిళ్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, విమల, లలితామణి, శ్రీదేవి, శేఖర్ రెడ్డి, శారద ఉన్నారు. వీరు ప్రయాణిస్తున్న తుఫాన్ ఎదురుగా వచ్చిన స్విఫ్ట్‌ను ఢీ కొట్టడంతో ఆగాపల్లి వాసి వంగూరి ఎర్రేశ్(40) ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పలువురు క్షతగాత్రులవ్వగా వారిలో కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.